కొవిడ్‌లో కొత్త వేరియంట్లు

- దవాఖానలను అప్రమత్తం చేసిన ఏపీ, ఢిల్లీ, కర్ణాటక సహా పలు రాష్ట్రాల ప్రభుత్వాలు
- వృద్ధులు, బాలలు మాస్క్‌లను ధరించాలని వైద్యుల సూచన
- ఆరోగ్యవంతులు 2 వారాల్లో కోలుకుంటారని వైద్యుల భరోసా

హైదరాబాద్ గాంధీ దవాఖానలో కొవిడ్ రోగుల కోసం సిద్ధమవుతున్న ప్రత్యేక వార్డు

న్యూఢిల్లీ: భారత్‌లో కొవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. కొవిడ్ కొత్త రూపాంతరాలు (వేరియంట్లు) ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్.7లను గుర్తించినట్లు ఇండియన్ సార్స్-కోవ్-2 జీనోమిక్స్ కన్సార్షియం (ఇన్సాకోగ్) శనివారం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, కర్ణాటక సహా మరికొన్ని రాష్ట్రాల్లో ఈ కేసులు నమోదవుతున్నాయని వెల్లడించింది. మూడేండ్లలో తొలిసారి ఢిల్లీలో 23 మందికి ఈ వైరస్ సోకడంతో ప్రభుత్వాలు దవాఖానలను అప్రమత్తం చేస్తున్నాయి. కేసులు తక్కువగానే ఉన్నాయని, అయినా తాము అప్రమత్తంగా ఉన్నామని, కేసుల సంఖ్యను, పరిస్థితులను సమీక్షిస్తున్నామని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. ఇటీవలి కాలంలో హాంగ్ కాంగ్, సింగపూర్, థాయ్‌లాండ్, చైనా తదితర దేశాల్లో వేల కొద్దీ కొవిడ్ కేసులు నమోదవుతున్నాయి. ఈ వైరస్ వ్యాప్తికి కారణం జేఎన్.1 రూపాంతరం, దాని ఉప రూపాంతరాలేనని అధికారులు తెలిపారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

కొవిడ్ కేసులు పెరుగుతుండటంతో ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, తీవ్ర స్థాయి వ్యాధులతో బాధ పడేవారు జాగ్రత్తగా ఉండాలని వైద్య, ఆరోగ్య నిపుణులు సూచించారు. ముక్కు, నోరుకు మాస్క్ ధరించాలని, తరచూ చేతులను శుభ్రం చేసుకోవాలని తెలిపారు.

సులువుగా జేఎన్.1 వ్యాప్తి

ప్రారంభంలో సార్స్-కోవ్-2 (SARS-CoV-2) వచ్చింది. దీనికి అనేక రూపాంతరాలు (వేరియంట్స్), ఉప రూపాంతరాలతో పెద్ద కుటుంబం ఏర్పడింది. కొవిడ్ మహమ్మారి ఐదో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో కొత్త ఉప రూపాంతరాలు వస్తున్నాయి. ఇటీవలి కాలంలో జేఎన్.1 రూపాంతరం, దాని ఉప రూపాంతరాలైన ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.5 ఉప రూపాంతరాలపై చర్చ జరుగుతున్నది. జేఎన్.1 స్పైక్ ప్రొటీన్‌లో 35కుపైగా పరివర్తనలు జరిగాయి. ఒమిక్రాన్ ఉప రూపాంతరాలైన ఎక్స్‌బీబీ.1.5.జేఎన్.1 వంటివాటి కన్నా చాలా సులువుగా జేఎన్.1 వ్యాపిస్తుంది. జేఎన్.1 సబ్ వేరియంట్లు అంతకు ముందు వేధించిన ఒమిక్రాన్, దాని ఉప రూపాంతరాల మాదిరిగా కాకుండా, కేవలం ఊపిరితిత్తుల పైభాగంలో మాత్రమే ఇన్ఫెక్షన్‌ను కలిగిస్తుందని వైద్యులు చెప్తున్నారు. ఊపిరితిత్తులపై వీటి ప్రభావం ఉండదని, ప్రాణ వాయువును తీసుకోలేకపోవడం, రక్తస్రావం, రక్తం గడ్డకట్టడం వంటి సమస్యలు ఉండవని తెలిపారు. ఒమిక్రాన్, దాని ఉప రూపాంతరాలు అంతటా పరిమిత స్థాయికి, అంటే, సీజనల్ జ్వరాల స్థాయికి క్షీణించినట్లు పేర్కొన్నారు. అప్పుడప్పుడు ఎక్కువగా విజృంభించవచ్చునని ఊహించామని, అదే ఇప్పుడు జరుగుతున్నదన్నారు. ఆరోగ్యవంతులు రెండు వారాల్లో కోలుకోగలుగుతారని డాక్టర్లు చెప్పారు.

పన్ను రాబడిలో రాష్ట్రాలకు 50% వాటా ఇవ్వాలి

- ఎస్ఎస్‌పీ నిధులు వెంటనే విడుదల చేయాలి
- నీతి ఆయోగ్ సమావేశంలో తమిళ నాడు సీఎం స్టాలిన్

న్యూఢిల్లీ,: దేశంలో పట్టణ ప్రాంతాల అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులతో కూడిన ఓ భారీ ప్రాజెక్టు అవసరమని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. మెరుగైన మౌలిక సౌకర్యాలు, రవాణా, ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ నూతన పట్టణ పునరుజ్జీవన ప్రాజెక్టును చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడిందని, అటువంటి ప్రాజెక్టును త్వరలోనే కేంద్రం చేపట్టాలని ఆయన కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన శనివారం న్యూఢిల్లీలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులతో నీతి ఆయోగ్ ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న స్టాలిన్ ప్రసంగిస్తూ పీఎం శ్రీ పథకానికి సంబంధించిన అవగాహన ఒప్పందంపై సంతకం చేయని కారణంగా రాష్ట్రాలకు సర్వ శిక్షా అభియాన్‌నిధులను కేంద్ర నిలిపివేసిందని తెలిపారు. కేంద్ర పన్నులలో రాష్ట్రాల వాటాను 50 శాతానికి పెంచాలని కూడా స్టాలిన్ డిమాండ్ చేశారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు పన్ను ఆదాయంలో రాష్ట్రాల వాటాను 41 శాతానికి కేంద్రం పెంచిందని, కాని రాష్ట్రాలకు కేవలం 33.16 శాతం మాత్రం పంపిణీ చేసిందని ఆయన చెప్పారు.

అభివృద్ధి మోడల్‌గా బస్తర్!

నక్సల్ ప్రభావిత బస్తర్ ప్రాంత అభివృద్ధికి ఓ దీర్ఘకాల అభివృద్ధి దార్శనికత అవసరాన్ని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి నీతి ఆయోగ్ సమావేశంలో ప్రస్తావించారు. ఒకప్పుడు నక్సల్ హింసాకాండకు మారుపేరుగా ఉన్న బస్తర్ ప్రాంతం ఇప్పుడు అభివృద్ధి, ఉపాధి కల్పన, స్వయం సమృద్ధిలో దేశానికే మోడల్‌గా మారుతోందని ఆయన తెలిపారు. 2047 నాటికి బస్తర్ నుంచి రూ. 75 లక్షల కోట్ల సంపద సృష్టి జరగడానికి ఆయన ఓ ప్రణాళికను సమావేశంలో వివరించారు. ఆపరేషన్ సిందూర్, ట్రంప్ సుంకాల బాదుడు లాంటి కీలక పరిణామాల తర్వాత జరిగిన కీలకమైన నీతి ఆయోగ్ ఉన్నత స్థాయి సమావేశానికి పశ్చిమ బెంగాల్, బీహార్, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి ముఖ్యమంత్రులు గైర్హాజర్యారు. కేరళ సీఎం తరపున ఆ రాష్ట్ర ఆర్థిక మంత్రి బాలగోపాల్ సమావేశంలో పాల్గొన్నారు. ఇంకొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలున్న వేళ బీహార్ సీఎం నితీశ్ గైర్హాజరు కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మరోవైపు నీతి ఆయోగ్‌ని అయోగ్య సంస్థగా అభివర్ణించిన కాంగ్రెస్ నీతి ఆయోగ్ సమావేశాన్ని మరో ప్రహసనంగా, దృష్టి మళ్లింపు కార్యక్రమంగా అభివర్ణించింది.

టీమ్ ఇండియాలా పని చేస్తే సాధ్యం కానిది లేదు: మోదీ

టీమ్ ఇండియా తరహాలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలు కలసి పనిచేస్తే ఏ లక్ష్యం అసాధ్యం కాదని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. నీతి ఆయోగ్ 10వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ప్రధాని ప్రసంగిస్తూ అభివృద్ధిని మరింత వేగవంతం చేయవలసిన అవసరం ఉందని అన్నారు. నేటి నీతి ఆయోగ్ గవర్నిరంగ్ కౌన్సిల్ ఇతివృత్తం వికసిత్ రాజ్యం నుంచి వికసిత్ భారత్ 2047 అని, ఇది 140 కోట్ల ప్రజల ఆశయమని ప్రధాని తెలిపారు. సకల సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు సమకూర్చడం ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రతి రాష్ట్రం కనీసం ఒక్క పర్యాటక ప్రదేశాన్నయినా అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. దేశంలోని నగరాల అభివృద్ధికి ప్రగతి, ఆవిష్కరణ, సుస్థిరత చోదక శక్తి కావాలని ఆయన తెలిపారు. కార్మిక శక్తిలో మహిళలను కూడా భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టంచేశారు.

రాహుల్ గాంధీపై నాన్ బెయిలబుల్

వారెంట్ జారీ చేసిన ప్రజాప్రతినిధుల న్యాయస్థానం

న్యూఢిల్లీ, మే 24: పరువు నష్టం కేసులో జార్ఖండ్‌లోని చైబాసా ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి నాన్ బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసింది. జూన్ 26న న్యాయస్థానం ముందు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ రాహుల్ న్యాయవాది చేసిన విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించింది. 'హత్యా నేరారోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి సైతం బీజేపీ అధ్యక్షుడు కావొచ్చు' అంటూ అప్పటి పార్టీ అధ్యక్షుడు అమిత్ షాను ఉద్దేశించి 2018లో జరిగిన కాంగ్రెస్ ప్లీనరీలో రాహుల్ గాంధీ విమర్శలు చేశారు. దీనిపై బీజేపీ నేత ప్రతాప్ కతియార్ వేసిన పరువునష్టం కేసుపై న్యాయస్థానం విచారణ సాగిస్తున్నది.

ఎక్స్‌ప్రెస్‌వేపై బీజేపీ నాయకురాలి భర్త అసభ్యకర ప్రవర్తన!

భోపాల్: బీజేపీ మద్దతు గల జిల్లా పంచాయతీ సభ్యురాలి భర్త మనోహర్లాల్ ధాకడ్ వేరొక మహిళతో నడిరోడ్డుపై పట్టుబడ్డారు. ధాకడ్ భార్య మధ్య ప్రదేశ్‌లోని మందసోర్ జిల్లా పంచాయతీ ఎనిమిదో వార్డు సభ్యురాలిగా ఉన్నారు. ధాకడ్ వేరొక మహిళతో ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్ వేపై రాత్రి వేళ కారు పక్కన అభ్యంతరకరంగా ప్రవర్తించినట్లు కనిపిస్తున్న వీడియో వైరల్ అయ్యింది. ఈ వీడియోను ఈ నెల 13న చిత్రీకరించినట్లు తెలుస్తున్నది. అయితే ధాకడ్ తమ పార్టీ సభ్యుడు కాదని బీజేపీ తెలిపింది. ధాకడ్‌ను ధాకడ్ మహాసభ జాతీయ కార్యదర్శి పదవి నుంచి తొలగించినట్లు ఆ సంఘం ప్రకటించింది.

ఈపీఎఫ్ వడ్డీ 8.25 శాతం

2024-25కుగాను కేంద్రం నోటిఫై

న్యూఢిల్లీ: ఈ ఏడాదైనా వడ్డీ రేటును పెంచుతారని ఆశించిన ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) చందాదారులకు నిరాశే ఎదురైంది. 2024-25 సంవత్సరానికి ఈపీఎఫ్‌వో నిల్వలపై వడ్డీ రేటును 8.25 శాతంగా కేంద్రం నోటిఫై చేసింది. ఈపీఎఫ్‌వో సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ కొన్ని రోజుల క్రితం ప్రతిపాదించిన వడ్డీ రేటును యథాతథంగా కేంద్రం ఆమోదించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి కూడా ఇదే వడ్డీని కేంద్రం చెల్లించింది. త్వరలో 7 కోట్ల మంది చందాదారుల ఖాతాల్లో వడ్డీ జమ కానున్నది. ఖాతాల్లో జమ అయ్యిందో, లేదో చెక్ చేసుకోవడానికి ఉమంగ్ యాప్‌లో లాగిన్ కావొచ్చు.

ఉగ్ర దాడుల్లో 20 వేల మంది భారతీయులను చంపారు

సింధూ జలాలను వదలం ఐరాసలో భారత రాయబారి

న్యూఢిల్లీ: గత నాలుగు దశాబ్దాల కాలంలో ఉగ్రవాదుల దాడుల్లో 20 వేల మంది భారతీయులు మరణించారని, ఈ కాలంలో భారత్ అసాధారణమైన ఓర్పు, ఔదార్యం పాటించిందని ఐరాసలో భారత శాశ్వత రాయబారి పర్వతనేని హరీష్ అన్నారు. సింధూ జలాల ఒప్పందంపై పాకిస్థాన్ తప్పుడు సమాచారాన్ని ఇస్తున్నదని పర్వతనేని హరీష్ ఆరోపించారు. పాకిస్థాన్ ఉగ్రదాడికి నిరసనగా భారత్ సింధూ జలాలను నిలిపివేయడాన్ని సమర్థించారు. పాకిస్థాన్ కేంద్రంగా నిర్వహిస్తున్న సీమాంతర ఉగ్రవాదానికి ఆ దేశం స్వస్తి పలికే వరకు సింధు జలాల నిలిపివేత కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఉగ్రవాదుల కోసం నేపాల్ సరిహద్దులో గాలింపు

న్యూఢిల్లీ: భారత్-నేపాల్ సరిహద్దులో ఇరు దేశాల సైనికులు సంయుక్తంగా గస్తీ, గాలింపు చర్యలు చేపట్టారు. ఇరు దేశాల మధ్య ఉన్న అడవుల్లోకి పాకిస్థానీ ఉగ్రవాదులు చొరబడినట్లు భారత్‌కు సమాచారం అందింది. నేపాల్‌గంజ్‌లోని మర్కజ్‌కు పాకిస్థానీలు వస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో భద్రతకు సంబంధించిన సమాచారాన్ని నేపాలీ దళాలు భారత దళాలకు అందజేస్తూ ఉంటాయి. భారత్-నేపాల్ మధ్య ఉన్న సుమారు 1,700 కిలోమీటర్ల పొడవైన సరిహద్దులో కంచె లేదు. ఉగ్రవాదుల చొరబాటును నిరోధించేందుకు భారత్-నేపాల్ దళాలు కృషి చేస్తున్నాయి.

19 వేల మంది చిన్నారులను పొట్టన బెట్టుకున్నారు

- ఇజ్రాయెల్ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసిన ఆ దేశ ఎంపీ ఒడె
- పార్లమెంట్ నుంచి బలవంతంగా బయటకు పంపిన మార్షల్స్
- తాజా దాడులతో గాజాలో 60 మంది దుర్మరణం

టెల్ అవీవ్, మే 24: యుద్ధం పేరిట గాజాలో ఇజ్రాయెల్ జరుపుతున్న మారణకాండపై సాక్షాత్తూ ఆ దేశానికి చెందిన ఎంపీ ఆ దేశ పార్లమెంట్ క్నెసెట్ సాక్షిగా ప్రభుత్వాన్ని నిలదీశారు. ఏడాదిన్నరగా గాజాపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 19 వేల మంది పిల్లలు, 53 వేల మంది పౌరులు మరణించారని, అక్కడ ఉన్న అన్ని విశ్వవిద్యాలయాలు, దవాఖానలు ధ్వంసం చేశారని ఆరోపించారు. 'ఇంత చేసినా రాజకీయంగా విజయం సాధించలేదని భావిస్తున్న పిచ్చివాళ్లు మీరు' అని విపక్ష ఎంపీ ఐమన్ ఒడె ప్రభుత్వాన్ని నిలదీశారు. ఆయన మాట్లాడుతుండగా అధికార ఎంపీలు అభ్యంతరం చెప్పారు. అదే సమయంలో మార్షల్స్ ఆయనను బలవంతంగా పోడియం నుంచి తీసుకుపోయారు. కాగా, గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా 24 గంటల వ్యవధిలో ఇజ్రాయెల్ మైమానిక దళాలు జరిపిన దాడిలో 60 మంది మరణించారని గాజా ఆరోగ్య శాఖ తెలిపింది.

అత్యంత క్రూర దశలో ఇజ్రాయెల్ యుద్ధం

గాజాలో ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని, వారికి కనీస సదుపాయాలు కూడా అందడం లేదని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియా గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ గాజాపై చేస్తున్న యుద్ధం ప్రస్తుతం అత్యంత క్రూర దశలో ఉందని అన్నారు. ఐరాస ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సుమారు 400 ట్రక్కుల్లో గాజాలోకి సాయం ప్రవేశిస్తే 115 ట్రక్కుల సాయం మాత్రమే అందిందన్నారు. గాజాలోని పరిస్థితులపై ప్రపంచ ఆరోగ్య సంస్థ అధిపతి టెడ్రోస్ అధనమ్ కూడా ఆందోళన వ్యక్తం చేశారు. గాజాలోని ప్రజలపై దయ చూపాలని టెల్ అవీవ్‌ను కోరుతున్నట్టు ఆయన విజ్ఞప్తి చేశారు.

వైద్య విద్యార్థినిపై గ్యాంగ్ రేప్

డబుల్ ట్రబుల్ ఇంజిన్

- మత్తు మందు ఇచ్చి మోసగించిన మిత్రుడు
- మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లాలో దారుణ ఘటన

ముంబై, మే 24 (నమస్తే తెలంగాణ): బీజేపీ పాలిత మహారాష్ట్రలో మత్తు మందు ఇచ్చి వైద్య విద్యార్థినిపై సామూహిక లైంగిక దాడి చేసిన ఘటన సంచలనం రేపింది. ఈ ఘటన ఈ నెల 18న సాంగ్లి జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైద్య విద్యార్థిని తన స్నేహితుడితో సినిమాకు వెళ్లింది. సినిమా అయిపోయాక అతను యువతిని ఫ్లాట్‌కు తీసుకెళ్లాడు. అనంతరం ఆమెకు మత్తుమందు కలిపిన కూల్ డ్రింక్ ఇచ్చాడు. బాధితురాలు మత్తులోకి జారుకోగానే స్నేహితుడితో పాటు మరో ఇద్దరు కలిపి ఆమెపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. కాసేపటి తర్వాత స్పృహలోకి వచ్చిన బాధితురాలు తనపై లైంగిక దాడి జరిగిన విషయాన్ని గమనించి తన స్నేహితుడిని ప్రశ్నించింది. అయితే ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపుతానని అతడు ఆమెను బెదిరించాడు. అయితే ఇంటికి చేరుకున్న ఆ యువతి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు వెంటనే విశ్రామ్‌బాగ్ పోలీసులను ఆశ్రయించారు. కేసు దర్యాప్తు జరిపిన పోలీసులు నిందితులను వినయ్ విశ్వేష్ పాటిల్(22), సర్వజ్ఞ సంతోష్ గైక్వాడ్(20), తన్మయ్ సుకుమార్ పెడ్నేకర్(21)లుగా గుర్తించారు. నిందితులను అరెస్ట్ చేసిన అనంతరం కోర్టులో హాజరు పరచగా మే 27 వరకు పోలీసు కస్టడీకి అప్పగించింది.

విమానాల్లో కిటికీ తెరలను మూసి ఉంచాలి

డీజీసీఏ మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, మే 24: రక్షణ శాఖ మైమానిక స్థావరాల్లో టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో విమానాల కిటికీ తెరలను(విండో షేడ్స్) మూసివేసి ఉంచాలని డీజీసీఏ శనివారం ఆదేశాలు జారీ చేసింది. అంతేగాక సైన్య స్థావరాల వద్ద టేకాఫ్, ల్యాండింగ్ అవుతుండగా..ఆ స్థావరాలను ఫొటోలు, వీడియో తీయటం నిషిద్ధమని డీజీసీఏ పేర్కొన్నది. ఈ మేరకు నిబంధనలు పాటిస్తూ, విమాన ప్రయాణికులను అప్రమత్తం చేయాలని కమర్షియల్ ఎయిర్‌లైన్స్‌ను డీజీసీఏ కోరింది. పౌర విమానయానం, మిలిటరీ ఆపరేషన్లు..రెండింటికీ వినియోగిస్తున్న పలు విమానాశ్రయాల్లో ఈ నిబంధనలు వర్తిస్తాయని డీజీసీఏ పేర్కొన్నది. మరీ ముఖ్యంగా పాక్‌తో సరిహద్దు ఉన్న పశ్చిమ భారత స్థావరాల వద్ద ఈ సూచన తప్పక పాటించాలని పేర్కొన్నది.

ఎన్నికలపై ఒత్తిడి చేస్తే మరో ప్రజా ఉద్యమం

యూనస్ హెచ్చరిక

ఢాకా: అసమంజసమైన డిమాండ్ల ద్వారా తమపై ఒత్తిడి పెంచడానికి ప్రయత్నిస్తే ప్రజా మద్దతుతో కార్యాచరణ చేపట్టవలసి వస్తుందని బంగ్లాదేశ్ ఆపద్ధర్మ ప్రభుత్వ ముఖ్య సలహాదారు మొహమ్మద్ యూనస్, ఆయన సహాయకులు శనివారం హెచ్చరించారు. దేశంలో డిసెంబర్‌లోగా ఎన్నికలు నిర్వహించాలని ఆర్మీ చీఫ్ జనరల్ వకర్ ఉజ్ జమాన్, ఖలీదా జియా సారథ్యంలోని బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ నుంచి వస్తున్న డిమాండ్ల నేపథ్యంలో ఈ హెచ్చరిక వెలువడింది. గడచిన తొమ్మిది నెలలుగా బంగ్లాదేశ్‌లో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు, నిరసనలు జరుగుతున్నాయి. ప్రభుత్వ స్వయం ప్రతిపత్తికి, సంస్కరణల యత్నాలకు, న్యాయ ప్రక్రియకు, స్వేచ్ఛాయుత ఎన్నికలకు, ప్రభుత్వ విధి నిర్వహణకు ఆటంకం కలిగించే విధంగా ఎటువంటి చర్యలు జరిగినా ప్రజలతో సంప్రదించి అవసరమైన నిర్ణయాలు ప్రభుత్వం తీసుకుంటుందని యూనస్ కార్యాలయం శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించింది. యూనస్ తన పదవికి రాజీనామా చేయరని కూడా తెలిపింది.

గెరిల్లా పోరులో కశ్మీర్ పోలీసులకు శిక్షణ

పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో డీజీపీ కీలక నిర్ణయం

శ్రీనగర్, మే 24: మొట్టమొదటిసారి జమ్ము కశ్మీర్ పోలీసులు అడవిలో యుద్ధం చేయడంపై శిక్షణ పొందనున్నారు. స్పెషల్ ఆపరేషన్స్ గ్రూపు(ఎస్ఓజీ) సిబ్బంది అడవిలో యుద్ధం చేయడానికి సంబంధించిన శిక్షణ పొందేందుకు సంసిద్ధమవుతున్నారు. జమ్ము కశ్మీరులోని పర్వత ప్రాంతాలు, లోయలతో నిండిన అటవీ ప్రాంతాలు ఉగ్రవాదులకు వరంగా మారడంతో ఈ ప్రాంతాలపై పట్టు లేని ఎస్ఓజీ సిబ్బందికి ఈ ప్రాంతాలలో యుద్ధం చేయడానికి అవసరమైన శిక్షణను అందచేయనున్నారు. నిఘా వర్గాల నుంచి ముందస్తు సమాచారం లేకపోవడం, దట్టమైన అడవులతో కూడిన పర్వత ప్రాంతం కావడంతో ఉగ్రవాదుల కోసం భద్రతా సిబ్బంది ముందుకు వెళ్లలేని పరిస్థితి వంటివి పహల్గాం దాడి ద్వారా నేర్చుకున్న పాఠాలని, వీటిని అధిగమించడానికే అడవిలో గెరిల్లా యుద్ధ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. 2023లో జమ్ము కశ్మీర్ డీజీపీగా బాధ్యతలు చేపట్టిన ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి నళిన్ ప్రభాత్ ఆలోచనా ఫలితమే ఈ నిర్ణయమని తెలుస్తోంది. అడవులు, ఎత్తయిన పర్వత ప్రాంతాలలో యుద్ధ శిక్షణ పొందాలని ఎస్ఓజీ యానిట్లను ప్రభాత్ ఆదేశించారు. "శిక్షణలో ఎంత ఎక్కువగా చెమట చిందిస్తే ఉగ్రవాదులతో జరిపే సమరంలో అంత తక్కువ రక్తం పారుతుంది" అని ఓ సీనియర్ పోలీసు అధికారి వ్యాఖ్యానించారు. కొన్ని బృందాలు ఇప్పటికే కఠిన శిక్షణను పూర్తి చేసుకోగా ఇతర బృందాలు శిక్షణ పొందేందుకు సిద్ధమవుతున్నాయి.

'ఆపరేషన్ సిందూర్'లో 200 మంది పాకిస్థానీల మృతి!

న్యూఢిల్లీ, లక్నో, అహ్మదాబాద్: పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగా భారత్ నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' దాడుల్లో 200 మందికిపైగా పాకిస్థానీలు మరణించారు! వీరిలో అత్యధికులు ఉగ్రవాదులు కాగా, మిగిలినవారు సైనికులు. రక్షణ శాఖ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా రాసిన కథనాల ప్రకారం, ఈ నెల 7న పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీరులలోని 9 ఉగ్రవాద స్థావరాలపై భారత్ మెరుపు దాడులు చేసింది. ఈ దాడుల్లో 170 మంది ఉగ్రవాదులు మరణించారు. అవమాన భారంతో ఊగిపోతున్న పాక్ ఎప్పుడైనా దాడి చేసే అవకాశం ఉండటంతో భారత దళాలు అప్రమత్తంగా ఉన్నాయి.

'పహల్గాం'కు ముందు పాక్‌కు హరూన్

గూఢచర్యం ఆరోపణలపై యూపీ పోలీసులు అరెస్ట్ చేసిన మహమ్మద్ హరూన్ పహల్గాం ఉగ్ర దాడికి ముందు పాకిస్థాన్‌కు వెళ్లినట్లు అతని కుటుంబ సభ్యులు తెలిపారు. హరూన్ ఢిల్లీలో తుక్కు వ్యాపారం చేస్తుంటాడు. అతను పాకిస్థానీ అమ్మాయిని రెండో పెండ్లి చేసుకున్నాడు. ఢిల్లీలోని పాకిస్థాన్ దౌత్య కార్యాలయం అధికారి ముజమ్మల్ హుస్సేన్‌తో హరూన్‌కు సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

గూఢచర్యం చేస్తున్న మరో వ్యక్తి అరెస్ట్

పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తున్న ఓ వ్యక్తిని గుజరాత్ ఏటీఎస్ అరెస్ట్ చేసింది. ఐఎఫ్, బీఎస్ఎఫ్‌కు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని అతడు పాకిస్థాన్ ఏజెంట్లకు చేరవేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నిందితుడు సహదేవ సింగ్ గోహిల్ (28)ను ఓ హెల్త్ వర్కర్‌గా గుర్తించారు.

పాక్ చొరబాటుదారుడి కాల్చివేత

గుజరాత్‌లోని బనాస్‌కాంఠా జిల్లాలో శుక్రవారం రాత్రి అక్రమంగా భారతీయ సరిహద్దుల్లోకి చొరబడేందుకు ప్రయత్నించిన ఓ పాకిస్థాన్ జాతీయుడిని బీఎస్ఎఫ్ సిబ్బంది కాల్చివేశారు.

జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

ఇద్దరు నక్సలైట్లు మృతి

రాంచీ, మే 24:జార్ఖండ్ జన్ ముక్తి పరిషద్‌కు చెందిన అగ్రనేతతో సహా ఇద్దరు మావోయిస్టులు శనివారం భద్రతా దళాల ఎదురుకాల్పులలో మరణించారు. జార్ఖండ్‌లోని లతేహార్ జిల్లాలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. అగ్రనేత పప్పూ లోహరా, మరో కీలక నాయకుడు ప్రభాత్ గుంఝు భద్రతా దళాల ఎదురుకాల్పులలో మరణించినట్లు భద్రతా దళాలు తెలిపాయి. పప్పూ లోహరాపై రూ.10 లక్షలు, ప్రభాత్ గుంఝుపై రూ.5 లక్షల రివార్డు ఉన్నట్లు వర్గాలు తెలిపాయి. గాయపడిన మరో నక్సలైట్‌ని అరెస్టు చేసినట్లు వారు చెప్పారు. భద్రతా దళాల ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని చెప్పారు.

అరేబియాలో ఒరిగిన నౌక

చమురు, ఇతర సరుకు సముద్రం పాలు.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

తిరువనంతపురం, మే 24: కేరళలోని కోచి పోర్టుకు సరుకుతో వస్తున్న లైబీరియాకు చెందిన ఒక వాణిజ్య నౌక కేరళలోని అరేబియా సముద్ర జలాల్లో శనివారం ప్రమాదవశాత్తు పక్కకు ఒరిగిపోయింది. కోచీకి నైరుతిగా సుమారు 38 నాటికల్ మైళ్ల దూరంలో ఎంఎస్‌సీ అనే లైబీరియా నౌక ప్రమాదవశాత్తు ఒరిగిపోయింది. దీంతో అందులోని చమురుతో పాటు కొంత సరుకు సముద్రం పాలైంది. ఆ నౌకలో ఉన్న 24 మంది నావికా సిబ్బందిని కోస్ట్‌గార్డు వారు రక్షించారు. తీర ప్రాంతంలో చమురు తెట్టు కొట్టుకొస్తుందని, దీనిపట్ల అప్రమత్తంగా అధికారులు ప్రజలను హెచ్చరించారు.

రుజువు అడిగేవాళ్లని విమానానికి కట్టేసి, పాక్‌కు పంపాలి

'ఆపరేషన్ సిందూర్'పై బీజేపీ ఎంపీ జోషి

న్యూఢిల్లీ : 'ఆపరేషన్ సిందూర్'కు రుజువులు కావాలనేవారిని భారత వాయు సేన విమానానికి వేలాడదీసి, పాకిస్థాన్‌కు పంపించాలని రాజస్థాన్‌లోని చిత్తోర్‌గఢ్ బీజేపీ ఎంపీ సీపీ జోషీ అన్నారు. ఆయన శనివారం ఉదయ్‌పూర్ జిల్లా పరిషత్ సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ''కొందరు పాకిస్థానీ భాష మాట్లాడుతున్నారు. రాహుల్ గాంధీ చాలా ప్రశ్నలు లేవనెత్తారు. ఇప్పుడు యావత్తు ప్రపంచం 'ఆపరేషన్ సిందూర్' వీడియోలను చూసింది'' అన్నారు.

మయన్మార్ తీరంలో 427 మంది జల సమాధి!

నైపేయీ: మయన్మార్ తీర ప్రాంతంలో విషాద సంఘటన చోటు చేసుకుంది. రొహింగ్యా శరణార్థులతో వెళ్తున్న రెండు ఓడలు మునిగిపోయాయి. ఈ ఘోర దుర్ఘటనల్లో సుమారు 427 మంది ప్రాణాలు కోల్పోయి ఉంటారని ఐక్యరాజ్యసమితి(ఐరాస) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఐరాస ప్రాథమిక సమాచారం ప్రకారం, ఈ నెల 9న, 10న రెండు ఓడలు నీట మునిగాయి. ఈ రెండు ఘటనల్లో కలిపి మొత్తం 427 మంది మరణించి ఉండవచ్చునని ఐరాస అంచనా వేస్తున్నది.

బతిమిలాడకుండా పోరాడి ఉండాల్సింది!

పహల్గాం బాధిత మహిళలపై బీజేపీ ఎంపీ వివాదాస్పద వ్యాఖ్యలు